# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-10-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశ గౌరవం, సమగ్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు.**
2. **జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలైన పరిశుభ్రత, ఖద్దరు వస్త్రాలు, హస్తకళలపై ప్రజల్లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ తెలిపారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో 'ఆటో డ్రైవర్ సేవలో…' పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు ప్రారంభించనున్నారు.**
4. **రాజధాని ప్రాంతంలో అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది.**

=========================

దేశ గౌరవం, సమగ్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు. హైదరాబాదులో జీటో కనెక్ట్ సదస్సును కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డితో కలిసి ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ.. స్వావలంభన లక్ష్యంగా ఆత్మనిర్భర్ భారత్ దిశగా రక్షణ రంగం ముందుకు సాగుతోందని వెల్లడించారు. రక్షణ ఉత్పత్తులకు కేంద్రంగా దేశం మారనుందని స్పష్టం చేశారు.

-------------------------

జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలైన పరిశుభ్రత, ఖద్దరు వస్త్రాలు, హస్తకళలపై ప్రజల్లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి త్యాగరాజ మండపంలో ఖాదీ సంత 'ఖాదీ ఫర్ నేషన్ – ఖాదీ ఫర్ ఫ్యాషన్' కార్యక్రమంలో నిన్న పాల్గొన్న ఆయన ఖాదీ స్టాల్స్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ..

(వాయిస్..33 సెకన్లు)

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం చేసేందుకు రూపొందించిన 'ఆటో డ్రైవర్ సేవలో…' పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రారంభించనున్నారు. విజయవాడలో ఏర్పాటు

చేసిన కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరు కానున్నారని అధికారులు తెలిపారు. ఈ పథకం కింద అర్హులైన డ్రైవర్లకు ఏడాదికి 15 వేల రూపాయల చొప్పున, రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల 90 వేల 669 మంది లబ్ధిదారులకు 436 కోట్ల రూపాయలను వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనున్నారు.

----------------------------

రాజధాని ప్రాంతంలో అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు స్పెషల్ పర్పస్ వెహికల్ – ఎస్‌పివిని ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం అమరావతి సచివాలయంలో నిన్న జరిగింది. గ్రీన్‌హైడ్రోజన్ ప్రాజెక్టు అభివృద్ధికి సలహా కమిటీని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. పలు సాగునీటి ప్రాజెక్టుల పనులకు, పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు వివిధ సంస్థలకు భూములు కేటాయించేందుకు అనుమతులు ఇచ్చింది. మంత్రివర్గ సమావేశం వివరాలను సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వివరిస్తూ...

(వాయిస్.. 30 సెకన్లు)

----------------------------

అభివృద్ధి పనులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వేగవంతం చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, నాబార్డు వంటి వివిధ పథకాల కింద పంచాయితీ రాజ్, రోడ్లు భవనాల శాఖలు చేపట్టిన పనుల పురోగతిని కేంద్రమంత్రి నిన్న సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....

(వాయిస్.... 30 సెకన్లు)

----------------------------

దేశంలో స్వదేశీ ఉద్యమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టారని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. విజయవాడలో బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించిన ఖాదీ సంత ముగింపు కార్యక్రమంలో నిన్న పాల్గొన్న ఆయన మాట్లాడుతూ..

(వాయిస్.. 33 సెకన్లు)

----------------------------

వస్తు సేవల పన్ను – జిఎస్టీ సంస్కరణలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని చిత్తూరుజిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి పేర్కొన్నారు. కలెక్టరేట్ ఆవరణలో వ్యవసాయ అనుబంధ రంగాల శాఖల ఆధ్వర్యంలో 'సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్' నినాదంతో నిన్న నిర్వహించిన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన యంత్రాలు, పరికరాలపై జీఎస్టీ 12 శాతం నుండి 5 శాతం తగ్గించడం వల్ల రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు.

----------------------------

దేశ వ్యాప్తంగా చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17వ తేదీ నుంచి

అక్టోబరు 16 వరకు పోషకాహార మాసంగా నిర్వహిస్తోంది. పిల్లల ఆరోగ్యాన్ని సంరక్షించి వారిని ఆరోగ్య వంతులుగా తీర్చి దిద్దడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. ఇందు కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించాలన్న ఉద్దేశ్యంతో పోషకాహార మాసం నిర్వహిస్తున్నారు. బాల బాలికల ఆరోగ్య పరిరక్షణకు ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

---------------------------

అహ్మదాబాద్ వేదికగా వెస్టిండీస్‌తో జరుగుతున్న క్రికెట్ తొలి టెస్ట్ మ్యాచ్‌లో రెండవ రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 286 పరుగుల భారీ ఆధిక్యాన్ని సొంతం చేసుకుంది. తొలి రోజు 2 వికెట్ల నష్టానికి 121 పరుగులు చేసిన భారత్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 448 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 162 పరుగులకే ఆలౌట్ అయ్యింది. 3వ రోజు ఆట ఈ ఉదయం ప్రారంభం కానుంది.

---------------------------

గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు పనులను లక్ష్యానికు అనుగుణంగా పూర్తి చేయాలని నిర్మాణ సంస్థలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పోలవరం ప్రాజెక్టు పనులపై ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. డయాఫ్రం వాల్, బట్రెస్ డ్యామ్, వివిధ నిర్మాణాల పురోగతిని అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు.

---------------------------

తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి భాగ్ సవారి ఉత్సవం నిన్న సాయంత్రం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు పూర్తయిన మరుసటి రోజు భాగ్‌సవారి ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవంలో భాగంగా స్వామివారు సాయంత్రం వైభవోత్సవ మండపం నుండి బయలుదేరి అప్రదక్షిణంగా అనంతాళ్వారు తోటకు చేరి అక్కడ ప్రత్యేక పూజలందుకొని తిరిగి ఆలయంలోనికి ప్రవేశించారు.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఒడిశాలోని గోపాల్‌పూర్ సమీపంలో తీరం దాటిందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇది ఉత్తర వాయవ్య దిశగా ఒడిశా, చత్తీస్‌గడ్ మీదుగా కదులుతూ తీవ్ర అల్పపీడనంగా బలహీన పడుతున్నట్లు పేర్కొంది. దీని ప్రభావంతో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకావముందని వాతారవరణ శాఖ అధికారి ఎం. వెంకట్రావు తెలియజేస్తూ,

..వాయిస్.. 15 సెకన్లు

తెలంగాణలో ఐదు రోజులపాటు అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలులతోపాటు చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

====================